క్లుప్తంగా

మల్లన్న పాదాలకు ప్రత్యేక పూజలు

ఐనవోలు : మండలంలోని సింగారం గ్రామ పరిధిలో గల శ్రీమల్లికార్జునస్వామి పాదాల గుడిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ మాజీ డైరక్టర్ సొనబోయిన సతీష్ తెలిపారు. అతి పురాతనమైన కాకతీయులు పాలించిన పుట్ట కోటపై మల్లన్న పాదాలు ఉండటం సింగారం ప్రజలకు గర్వకారణం అన్నారు. తిమ్మాపూర్, మామునూర్, కొండపర్తి, ముల్కలగూడెం, వరంగల్, బొల్లికుంట తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బొల్లు రాజు, తాడెం భరత్, కాగితం వెంకటేశ్వర్లు, ఇండ్ల మనోహర్, రాకేష్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం శివారులో కొందరు వ్యక్తులు పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేసినట్లు స్థానిక పోలీస్‌లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.9,940 నగదు, ఒక కారు, ఒక బైకు, 7సెల్ ఫోన్లు, 52 పేక ముక్కలు లభ్యం కాగా ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. తోట సంతోశ్, రాచర్ల మహేష్, మైదం శ్యామ్, రాచర్ల కిరణ్, తౌటం తిరుపతి, న్యాతి కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ఐనవోలు : మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, నందనం సొసైటీ మాజీ అధ్యక్షుడు బోయినపెల్లి లక్ష్మీనరసింహారావు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మీనరసింహారావు మృతదేహానికి నివాళులర్పించారు. టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేష్, నాయకులు మోహన్, సాంబయ్య, బుచ్చిరెడ్డి, రాకేష్‌రెడ్డి, చిర్ర శ్రీనివాస్, బండి మహేందర్, సమ్మెట రాజు, మండల సత్యం ఉన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

వేలేరు : మల్లికుదుర్ల గ్రామానికి చెందిన కుంట వెంకటమ్మ(75) ఈనెల 11న ఇంటి వద్ద కట్టెల పొయ్యిలోని మంటలు అంటుకుని గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వెంకటమ్మ స్నానం చేద్దామని కట్టెల పొయ్యిపై నీళ్లు వేడి చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆమెకు మంటలు అంటుకున్నాయి. వరంగల్ ఎంజీఎంకు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్తకొండకు కొత్తపల్లి రథాలు

ఎల్కతుర్తి : ప్రతీ సంవత్సరం జరిగే కొత్తకొండ బ్రహ్మోత్సవాల్లో కొత్తపల్లి రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ బండ్లను చూసేందుకు జాతరకు వేలాది మంది భక్తులు హాజరవుతారు. గతంలో కొత్తపల్లిలో ఐదు ఎడ్లబండ్లతో ప్రారంభమైన రథాలు క్రమక్రమంగా 65 వరకు చేరుకున్నాయి. ముల్కనూరుకు చెందిన అల్లిగిరెడ్డి వంశీయులు ప్రతీ ఏటా ఎడ్ల బండ్లపై కొత్తకొండ జాతరకు వెళ్లేవారు. 1939లో వారు జాతరకు వెళ్లేందుకు వీలు అవకపోవడంతో ఆ కుటుంబంతో సాన్నిహిత్యంగా ఉండే కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తితో ఎడ్లబండితో జాతరకు వెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో మల్లయ్య అనే వ్యక్తి కొత్తపల్లి నుంచి మరో ముగ్గురు వ్యక్తులు కాత ఆగారెడ్డిని తీసుకొని ఎడ్లబండ్లపై జాతరకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఇలా వెళ్తే స్వామి వారు కోరిన కోర్కెలు తీర్చడంతో పాటు పంటలు సంవృద్ధిగా పండుతాయని భక్తులు నేటికి విశ్వశిస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజు



వేలేరు : బీజేపీ మండల అధ్యక్షుడిగా శాలపల్లి గ్రామానికి చెందిన కాట్రేవుల రాజు యాదవ్ మూడోసారి ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయ్‌రామరావు, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

కోటగుళ్ల అభివృద్ధికి కృషి

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్‌లో కాకతీయుల కాలంలో నిర్మించిన కోటగుళ్ల త్రికూట శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. కోటగుళ్లను సోమవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆలయ పునర్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భోగి సంబురాలు



కమలాపూర్ : భోగి మంటలు కాలుస్తున్న యువకులు



ఐనవోలు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న యూత్ అసోసియేషన్ నాయకులు



శాయంపేట : ముగ్గులు వేస్తున్న మహిళలు

కమలాపూర్ : మండల వ్యాప్తంగా సోమవారం సంక్రాంతి భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని గుడిబండ వద్ద ప్రగతి యువజన సంక్షేమ సంఘం, ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి వేడుకల్లో మహిళలు, యువతి, యువకులు ఆటపాటలతో సందడి చేశారు. గ్రామస్తులు కర్ర సామగ్రి భోగి మంటల్లో వేసి పూజలు చేశారు. భోగి మంటల చుట్టు తిరుగుతూ యువకులు, గ్రామస్తులు నృత్యాలు చేశారు. మహిళలు, యువతులు ఇళ్ల ఎదుట అందమైన రంగవల్లులు అలంకరించి ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, నవధాన్యాలు పెట్టారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రగతి యూత్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, యువతి, యువకులు, మహిళలు, గ్రామస్తులతో తదితరులు పాల్గొన్నారు.

కొండపర్తిలో ముగ్గుల పోటీలు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలో ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 35 మంది మహిళలు పాల్గొనగా మొదటి బహుమతి కట్కూరి శ్రీవిద్య రూ.1,516 దాత కట్కూరి చంద్రమౌళి, రెండో బహుమతి తాళ్లపెల్లి శ్వేత రూ.1,016 దాత కట్కూరి చంద్రమౌళి, మూడో బహుమతి మంద స్రవంతి రూ. 516 దాత సజీవన్ అందించారు. అలాగే ప్రత్యేక బహుమతులు మాదాసు అనుజకు రూ.516 దాత కట్కూరి రాజు, కట్కూరి స్మార్టీకి రూ.516 గద్దల బజ్జీవన్ అందజేయగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ టిఫిన్ బాక్స్‌లు దాత కట్కూరి అశోక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు కట్కూరి రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి రాజేష్, కట్కూరి వంశీ ఉన్నారు.

శాయంపేటలో ముగ్గుల పోటీలు

శాయంపేట : సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కుమ్మరి వీధిలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మండల కేంద్రానికి చెందిన బేరుగు తరుణ్‌గోపి నగదు బహుమతి అందజేశారు. మొదటి బహుమతి గుండు నవ్య రూ. 2016, ద్వితీయ బహుమతి దిండిగాల సుప్రియ రూ. 10,16, తృతీయ బహుమతి సామల మిన్నుకు షీల్డ్ అందించారు. మాజీ సర్పంచ్ వల్పదాసు చంద్రమౌళి చేతుల మీదుగా నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో గిద్దమారి సురేష్, ఏనుగుల శ్రావణ్, బాసాని సాయి, ఉప్పునూతుల మణికేష్, ఉప్పు రమేశ్, గొలుసు చరణ్, బంటి పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల ప్రజలు సోమవారం భోగి వేడులను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు ఉదయాన్నే ఇంటి ఎదుట పల్లాకి చల్లి రకరకాల ముగ్గులు వేశారు. ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు పెట్టి పూలు, నవధాన్యాలు, రేగుపండ్లు ఉంచారు. పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురవేశారు. యువత సోషల్ మీడియాలో భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

పరకాలలో..



పరకాల : చిన్నారులకు భోగి పళ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు

పరకాల : భోగి పర్వదినాన్ని పట్టణ ప్రజలు ఎంతో సంబురంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామున ఇంటి ఎదుట రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, ధాన్యాలు, రేగుపండ్లు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళలో భోగి మంటలతో యువతి, యువకులు సందడి చేశారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలి

● ఎస్పీ పుల్లా శోభన్‌కుమార్



శోభన్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న పుల్లా వంశస్తులు

కమలాపూర్ : పంచాయతీ పేరుతో మన అభివృద్ధికి మనమే అడ్డుపడుతూ సమాజంలో వెనుకబడి పోవద్దని, పరస్పరం ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని ఎస్పీ పుల్లా శోభన్‌కుమార్ సూచించారు. ఇటీవల ఎస్పీగా పదోన్నతి పొందిన పుల్ల శోభన్‌కుమార్‌ను మండలంలోని వంగపల్లి శివారులో సోమవారం పుల్లా ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ శోభన్‌కుమార్ మాట్లాడుతూ.. తన కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని, కష్టాలు, నష్టాలు, అవమానాలు, ప్రశంసలు అనుభవించానని, దేనికి తలొగ్గకుండా అన్నింటినీ అధిగమించి ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. తన సర్వీస్‌లో మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వంటి నేరపూరిత వ్యవహారాల్లో బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువత బలి కావడం తనను ఎంతగానో బాధించాయన్నారు. ప్రస్తుత సమాజంలో యువత ప్రభుత్వ ఉద్యోగాల వేటలో పడుతున్నారని, వ్యాపార రంగం వైపు దృష్టి సారించాలని, వ్యాపార రంగాల్లోనూ అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. పుల్లా ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో తనను సన్మానించడం గర్వంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేట్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పుల్లా వంశస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై యుద్ధానికి మాదిగలు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న గంగారపు శ్రీనివాస్

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం చేసేందుకు మాదిగలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని మాదిగ బిడ్డలు ఫిబ్రవరి 7న లక్ష డప్పులు, వెయ్యి గొంతుల చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని కోరారు. వర్గీకరణ అమలుకై మాదిగలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బొడ్డు శాంతిసాగర్, మండల అధ్యక్షుడు సోంపల్లి అన్వేష్, నాయకులు చిలుక రాజు, కొట్టే కల్యాణ్, మాచర్ల బాబు, చిలుక విజయ్, రాహుల్, బన్నీ, రణధీర్, జయపాల్, పూర్ణ చందర్, అక్షయ్, చరణ్, బాబురావు, పందు, ఆరోగ్యం, రాకేష్ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఉప్పలయ్య

ఆత్మకూరు : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డ్‌ను పరిరక్షించాలని సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య అన్నారు. మండలంలోని అక్కంపేటలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహజ మరణం, దురదృష్టవశాత్తు జరిగే మరణాలకు స్కీములను ఇప్పటివరకు ప్రభుత్వమే అమలు చేసేదని, ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలని ప్రయత్నించడం వలన కార్మికులు నష్టపోతారన్నారు. అలాగే ప్రభుత్వ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గ్రామ అధ్యక్షుడు సాంబయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి రంగనాథుల కల్యాణం



గోదా కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయంలో, శివ మార్కండేయ వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాల్లో భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం గోదాదేవీ రంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, మార్త రాజ్‌కుమార్ వేదమంత్రోచ్ఛరణ నడుమ అంగరంగా వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. మత్స్యగిరి స్వామి ఆలయంలో స్వామివారికి అడ్వకేట్ గట్ల సరోజన విజయ్‌పాల్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మత్స్యగిరి స్వామి ఆలయ చైర్మన్ సామల భిక్షపతి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, మంగళ సూత్రం సమర్పించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ సుమన్

శాయంపేట : మండల కేంద్రంలో రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో పత్తిపాక, శాయంపేట టీమ్‌లు తలపడగా శాయంపేట టీమ్ ప్రథమ బహుమతి, పత్తిపాక టీమ్ ద్వితీయ బహుమతి సాధించింది. శాయంపేట మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, గడిపే విజయ్‌కుమార్ ప్రథమ బహుమతి సాధించిన శాయంపేట టీమ్‌కు రూ. 8,016లు, ద్వితీయ బహుమతి సాధించిన పత్తిపాక టీమ్‌కు రూ. 6,016 నగదు బహుమతిని అందజేశారు. రైజింగ్ స్టార్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు స్పందన

కమలాపూర్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని గుడిబండ వద్ద యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు చేరాల రోహిత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు స్పందన లభించింది. ఈ పోటీల్లో మహిళలు, యువతులు, చిన్నారులు పెద్దఎత్తున పాల్గొనగా మౌటం లావణ్య రూ.5,016, పిట్టల శ్రీవిద్య రూ.3,016, దూలం ప్రవస్తి రూ.2,016 నగదు పారితోషికాలు, ఏడుగురికి ప్రోత్సాహక బహుమతులుగా చీరలు, పోటీల్లో పాల్గొన్న మిగతా వారందరికీ టిఫిన్ బాక్సులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తౌటం రవీందర్, బాలసాని రమేశ్‌గౌడ్, చందుపట్ల నర్సింహారెడ్డి, డాక్టర్ మౌటం కుమారస్వామి, నాంపెల్లి ప్రభాకర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ధర్మోల శ్రీకాంత్, కార్యదర్శి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఎంబాడి తేజ, ప్రధాన కార్యదర్శి గాలీబు నవీన్, కార్యదర్శి మొగిలిచెర్ల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ కృష్ణమూర్తి, నాయకులు వైనాల సాంబయ్య, పెరుమాండ్ల పర్శ రాములు, దేవేందర్, రాజేష్ పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

కమలాపూర్ : మండలంలోని శనిగరంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, ఉప్పల్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, కమలాపూర్‌లో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాల్లో సంక్రాంతి, ధనుర్మాసం సందర్భంగా సోమవారం గోదాదేవి, రంగనాయకుల స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దెత్తున తరలివచ్చి గోదాదేవి, రంగనాయకుల స్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించారు. ఈ కల్యాణ మహోత్సవంలో మాజీ ఎంపీపీ తడక రాణిశ్రీకాంత్, ఆలయ అర్చకులు శ్యాంసుందరాచార్యులు, రామాచార్యులు, కృష్ణమాచార్యులు, హరీషాచార్యులు, లక్ష్మణాచార్యులు, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గోదాకృష్ణుల కల్యాణం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలో గల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గోదాకృష్ణుల కల్యాణాన్ని అర్చకులు నేత్రపర్వంగా జరిపించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధనుర్మాస వ్రతంలో 29వ రోజు గోదా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో 29వ పాశుర విన్నపం చేసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పాంచరాత్ర ఆగమం ప్రకారం గోదాకృష్ణుల కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది.

పశువుల అపహరణ

వేలేరు : మలికుదుర్ల గ్రామానికి చెందిన మూడిక సిద్దులుకు చెందిన నాలుగు పశువులను సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితులు తెలిపాడు. రోజుమాదిరిగానే పశువులను ఆదివారం రాత్రి వ్యవసాయ బావి వద్ద కట్టేయగా సోమవారం తెల్లవారుజామున చూసేసరికి పశువులు లేవని, వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి విచారణ చేపట్టినట్లు తెలిపాడు. ఈ విషయమై పోలీస్‌లను ఫోన్‌లో వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.